ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 06-11-2026 సమయం : 1.20 గంటలు

ముఖ్యాంశాలు

1. **బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం పర్యటిస్తారు.**

2. **రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల పరిధిలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌లో ఉదయం 11 గంటలవరకు 29.35 శాతం పోలింగ్ నమోదైంది.**

3. **తమిళనాడు మత్స్యకారుల బోటు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు.**

4. **స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది.**

==========

బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం పర్యటిస్తారు.ఆయా ప్రాంతాల్లో పర్యటించి, జరిగిన నష్టాన్ని పరిశీలిస్తారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి తుపాను ప్రభావిత ప్రాంతాలకు చేరుకొనున్నారు. ఈ సందర్భంగా బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్ద తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలిస్తారు. అలాగే దెబ్బతిన్న డ్రెయిన్లపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రేటూరు గ్రామానికి వెళ్లి రైతులను కలుసుకుని, తుఫాను కారణంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారని అధికారులు తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో భాగంగా ఈ రోజు నిర్వహిస్తున్న పోలింగ్‌లో ఉదయం 11 గంటల సమయానికి మొత్తం 29.35 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల పరిధిలోని 211 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోలింగ్‌లో ఉదయం 9 గంటలకు 12.56 శాతం ఓటింగ్ నమోదు కాగా, 11 గంటల సమయానికి అది 29.35 శాతానికి చేరింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 38.78 శాతం పోలింగ్ నమోదైంది. మార్కాపురం జిల్లాలో 36.51 శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 31.96 శాతం, పల్నాడు జిల్లాలో 30.11 శాతం, అనంతపురం జిల్లాలో 22.68 శాతం, ఏలూరు జిల్లాలో 16.58 శాతం,

శ్రీకాకుళం జిల్లాలో 12 శాతం పోలింగ్ నమోదైంది.

అనంతపురం జిల్లాలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. కూడేరు మండలం మరుట్ల గ్రామంలోని 8వ పోలింగ్ కేంద్రంతో పాటు, పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామంలోని 46, 47వ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఉదయం 9 గంటల సమయానికి చిత్రచేడులో 5.3 శాతం, మరుట్లలో 12.2 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తమిళనాడు మత్స్యకారుల బోటు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురసు తుపాను ప్రభావంతో సముద్రంలో ప్రతికూల వాతావరణం నెలకొన్న సమయంలో ఈ ప్రమాదం జరగడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కోసం జరుగుతున్న గాలింపు చర్యలపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తొమ్మిది మందితో ప్రయాణిస్తున్న బోటు ప్రకాశం జిల్లా కొత్తపట్నం తీరానికి కొట్టుకొచ్చిందని, ఇప్పటివరకు ఏడుగురు మత్స్యకారులు మృతి చెందగా, మరో ఇద్దరు గల్లంతైనట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. మృతదేహాలను గుర్తించి, పోస్టుమార్టం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఆలయ ఫరిపాలనకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల కమిటి స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్ర ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. తిరుమల ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఈరోజు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ.. టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ, వారి సౌకర్యాలకు ప్రాధాన్యమిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటామని రవిచంద్ర తెలియజేస్తూ..

వాయిస్ 29 సెకన్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభంకానున్న కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బ్యాలెట్ పేపర్ల ఓట్లను సిబ్బంది లెక్కించనున్నారు. ముందుగా ఎంపీటీసీ స్థానాల ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు. అనంతరం జడ్పీటీసీ స్థానాల ఓట్ల లెక్కింపు చేపడతారు.

విజయనగరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రేపు జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలోని 27 మండలాలకు 36 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ కేంద్రాల పరిధిలో మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఏక వినియోగ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని బ్రిక్స్ ఆంధ్రప్రదేశ్ నోడల్ అధికారి డాక్టర్ జె. విజయలక్ష్మి సూచించారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ..ప్లాస్టిక్‌కు బదులుగా తిరిగి ఉపయోగించుకోగల పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని రోగులు, ఆసుపత్రి సిబ్బంది, సందర్శకులకు సూచించారు. వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి కలిగే నష్టాలను ఆమె వివరించారు.

విశాఖపట్నం వేదికగా ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ప్రత్యేక కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ అధికారులకు సూచించారు. విశాఖలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌తో కలిసి రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సదస్సు సన్నాహక ఏర్పాట్లపై ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల పరిధిలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, పరస్పర సమన్వయంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్. రావత్ మాట్లాడుతూ, సీఐఐ సదస్సుకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘నషా ముక్త్ యువ, వికసిత్ భారత్’ ఆన్‌లైన్ క్విజ్‌కు యువత నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 16,517 మందికి పైగా ఈ క్విజ్‌లో పాల్గొన్నట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెల 25వ తేదీ వరకు క్విజ్‌లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపింది. ‘నషా ముక్త్ భారత్ అభియాన్’ ద్వారా ఇప్పటివరకు 35 కోట్ల మందికి పైగా ప్రజలకు అవగాహన కల్పించారు.

తూర్పు తెలంగాణ, దాని పరిసర కోస్తాంధ్ర ప్రాంతాలపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి సి. హెచ్ నాగభూషణం తెలియజేస్తూ... వాయిస్ 18 సెకన్లు

==========